
సాక్షి
పల్నాడు
గురువారం । 4 । జనవరి । 2024



క్యాలెండర్ ఆవిష్కరణ

పట్నంబజారు: సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం బుధవారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 19,845, ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రేషన్ పంపిణీ పరిశీలన



నరసరావుపేట రూరల్: వలంటీర్లు రేషన్ వాహనం వెంట ఉండి సరుకులు పంపిణీ పర్యవేక్షించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఇక్కుర్రులో రేషన్ పంపిణీని బుధవారం ఆయన పరిశీలించారు.

న్యూస్‌రీల్

రామలింగేశ్వర ఆలయ నిర్మాణానికి భారీ విరాళం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ కొండపై నిర్మాణంలో ఉన్న రామలింగేశ్వర ఆలయానికి పూజిత డాల్ మిల్లర్స్ నిర్వాహకులు భారీ విరాళం అందజేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.10లక్షలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాతల్ని శాలువాలతో సత్కరించారు. ఆలయ నిర్మాణంలో పాలుపంచుకుంటున్న పూజిత భాగస్వాములైన చందోలు మల్లికార్జున కుటుంబసభ్యుల్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పులిపాటి రామారావు, పెండేల పుల్లారావు, మాల్యాద్రి, రెడ్డి నగేష్‌బాబు, జాగర్లమూడి సుబ్బారావు, గంధం బాలిరెడ్డి, దండు చెన్నయ్య, నాగపవన్‌కుమార్, ములకా రామతులసీరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వర్సిటీని సందర్శించిన మంత్రి నాగార్జున



ఏఎన్‌యూ : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ప్రొఫెసర్ మేరుగ నాగార్జున బుధవారం వర్సిటీని సందర్శించారు. ఆయనకు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధిని వీసీ వివరించారు. రానున్న రోజుల్లో చేపట్టబోయే నూతన ప్రాజెక్టుల వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వర్సిటీ పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలని, రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విశ్వవిద్యాలయాల్లో ఏఎన్‌యూ ముందు వరుసలో నిలుస్తుందని మంత్రికి తెలియజేశారు. విశ్వవిద్యాలయాల మనుగడకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ఆచార్య కె మధుబాబు, సీడీఈ డైరెక్టర్ డాక్టర్. బి నాగరాజు, పీజీ పరీక్షల కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎల్.ఉదయ్ కుమార్, డాక్టర్ అబ్రహం లింకన్ తదితరులు మంత్రిని కలిశారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల బోటనీ, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున మాట్లాడుతూ 'నావెల్ ప్రాసెస్ అండ్ థైర్ అప్లికేషన్స్ ఇన్ బయాలజీ' అనే అంశంపై ఫిబ్రవరి 23, 24 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మానవాళి ఎదుర్కొంటున్న సమస్యల్లో పర్యావరణ, మొక్కలు దిగుబడి, అడవుల సంరక్షణ, క్యాన్సర్, డయాబెటిస్, ఏజింగ్, ఆల్జీమర్స్ వ్యాధుల మీద ప్రఖ్యాత శాస్త్రవేత్తల ఉపన్యాసాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.గంగాధర్ రావు, అధ్యాపకులు డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ పీఎస్ఎన్ రాజు, డాక్టర్ కే బాబు, డాక్టర్ కే నాగరాజు, డాక్టర్ కే విజయ్ కుమార్, జ్యోతి ఆదిత్య పాల్గొన్నారు.

యార్డుకు 59,321 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 59,321 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 57,983 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 23,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 34,701 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

ప్రమాదాల కట్టడికి స్పాట్

- నివారణకు చర్యలు తీసుకుంటున్న పోలీస్, రవాణా శాఖలు
- 2023లో 567 ప్రమాదాల్లో 388 మంది మృతి, 472 మందికి గాయాలు
- అతివేగం, నిర్లక్ష్యం, మద్యం మత్తు కారణం
- మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల్లోపు ఎక్కువగా ప్రమాదాలు
- 2022తో పోల్చితే 2023లో 22.6 శాతం తగ్గాయి



చిలకలూరిపేట రూరల్ మండలంలో జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు చేపట్టిన చర్యలు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట : పల్నాడు జిల్లాలో రోడ్డు ప్రమాదాల కట్టడికి పోలీసుశాఖ 'స్పాట్' పెట్టింది. ఎక్కువగా జరుగుతున్న రహదారులు, ప్రాంతాలు గుర్తించి, నివారణకు హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణలు, రేడియం స్టిక్కర్లు, జీబ్రా క్రాసింగ్‌లు, ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేసింది. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి పర్యటించి, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. రహదారి భద్రతపై వాహనదారులకు కూడా అవగాహన కల్పిస్తున్నారు. రహదారుల్లో ప్రమాదకర మలుపులు, జంక్షన్ల వద్ద పోలీసుల్ని కాపలా ఉంచి వాహనాల్ని నియంత్రిస్తున్నారు. ప్రమాదాల సంకేతాలను చూపిస్తూ సైన్ బోర్డులు పెట్టారు. రహదారుల మలుపుల వద్ద రేడియం స్టిక్కర్స్, సోలార్ బ్లింకర్స్ ఏర్పాటు చేసి వాహనదారుల్ని అప్రమత్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా చేపట్టిన చర్యల వల్ల మంచి ఫలితాలు కనిపిస్తునట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. గత రెండేళ్లతో పోల్చితే 2023లో రోడ్డు ప్రమాదాలు, మరణాలు, గాయాలు తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది మరింత తగ్గేలా పని చేస్తున్నామని చెబుతున్నారు. అతి వేగం, నిర్లక్ష్యం, డ్రైవర్లు మద్యం తాగడంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు.

97 స్పాట్లు గుర్తింపు

జిల్లాలో గత రెండు సంవత్సరాలలో రెండు లేక అంతకన్నా ఎక్కువ ప్రమాదాలు జరిగిన ప్రదేశాలు 97 ఉన్నట్టు గుర్తించారు. ఆ ప్రదేశాలలో పోలీస్, రవాణా, నేషనల్ హైవేస్, ఆర్ అండ్ బీ శాఖలు సంయుక్త సర్వే నిర్వహించాయి. ప్రమాదాలు జరగడానికి గల కారణాల్ని అధికారులు విశ్లేషించారు. ఎక్కువగా రోడ్డు జంక్షన్ల వద్ద జరుగుతున్నట్టు గుర్తించినట్లు జిల్లా రవాణాశాఖ అధికారి టి.కె. పరంధామరెడ్డి తెలిపారు.

ప్రమాదాలకు కారణమైన జంక్షన్ల గుర్తింపు

జంక్షన్ల వద్ద వాహనదారుల వేగాన్ని నియంత్రించకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణం. ఎన్‌హెచ్–16 పై గణపవరం – తిమ్మాపురం మధ్య, నార్కట్‌పల్లి– అద్దంకి హైవేలో పొందుగుల, గురజాల రోడ్డు జంక్షన్, గుంటూరు–పిడుగురాళ్ల రహదారిలో కంటిపూడి, పిడుగురాళ్ల మండలం కామేపల్లి, ముప్పాళ్ల, గుంటూరు–శ్రీశైలం రోడ్డులో అందుగలపాడు, రావిపాడు గ్రామాల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించారు. ఇవి కూడా మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల ప్రాంతంలో ఎక్కువగా జరుగుతున్నట్లు పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఆ సమయంలో 41 శాతం ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

గత మూడేళ్లలో ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	గాయాలు
2021	793	445	739
2022	733	407	663
2023	567	388	472

రహదారుల మీద ప్రమాదాలు ఇలా...

సంవత్సరం	జాతీయ రహదారులు	రాష్ట్ర రహదారులు	అంతర్గత రహదారులు
2021	211	368	214
2022	214	260	259
2023	138	210	219

ప్రమాదాల సంఖ్య తగ్గించాం



రోడ్డు ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. అవి ప్రదేశాలు, సమయం, కారణాలు, తీసుకోవాల్సిన చర్యలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసి, చర్యలు చేపడుతున్నాం. పోలీసు శాఖ చేపట్టిన చర్యలు మంచి ఫలితాన్ని ఇచ్చాయి. 2022లో పోల్చితే 2023లో ప్రమాదాలు 22.6 శాతం, గాయాలు 29 శాతం, మరణాలు 5 శాతం తగ్గాయి. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గించేలా పోలీసు శాఖ పని చేస్తోంది. అతి వేగం, మద్యం సేవించడం, జంక్షన్ల వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో అధికంగా సంభవిస్తున్నాయి.

– వై. రవిశంకర్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ



కలెక్టరేట్‌లో పింఛన్ లబ్ధిదారులకు మెగా చెక్ అందజేస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

మండలాలు, మున్సిపాలిటీల్లో 'పింఛను కానుక' వేడుక

- జిల్లాలో ఆరో తేదీ వరకు పెన్షన్ కానుక వారోత్సవాలు
- కలెక్టరేట్‌లో సీఎం జగన్ కార్యక్రమ వీక్షణ
- లబ్ధిదారులకు మెగా చెక్ అందజేసిన కలెక్టర్, అధికారులు
- నూతనంగా జిల్లాకు 2,995 పింఛన్ల మంజూరు
- 2,84,109 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రు.84.45 కోట్లు

నరసరావుపేట: జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా 2,84,108మంది లబ్ధిదారులకు ప్రతినెలా రు.84.45కోట్లు అందిస్తున్నట్లు కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల మైదానం నుంచి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పెంచిన పెన్షన్ రూ.3వేలు అందించే కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి లబ్ధిదారులతో కలసి వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక భద్రత కింద అందజేస్తున్న పింఛను కానుక జనవరి ఒకటి నుంచి మరో రూ.250లు పెంచడం ద్వారా రూ.3వేలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో నూతనంగా పింఛన్లు మంజూరైన 2,995 మందికి రు.89లక్షలు అందిస్తున్నామని వెల్లడించారు. ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈనెల ఒకటి నుంచి ఆరో తేదీ వరకూ మండలాలు, మున్సిపాలిటీల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఓటరు జాబితా సిద్ధం చేయండి

నరసరావుపేట: ఎన్నికల నియమావళి ప్రకారం ఓటర్ల జాబితా సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూఅధికారి కె.వినాయకంతో బుధవారం జిల్లాకు చెందిన ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, మూడు రెవెన్యూ డివిజన్ల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లుతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాకు కేటాయించిన అన్ని పనులు పూర్తిచేసి ఓటర్ల లిస్ట్ తయారీ నివేదికను సమర్పించాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి నివేదికలు, ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, బస్సులు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు వసంతబాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' సీఎం జగన్ లక్ష్యం

- భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలోని ఒకటో సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం



మందుల కిట్ అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఒకటలో సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి ఇంటికీ వైద్య సేవల కార్యక్రమం ప్రారంభంతో పాటు ఇప్పుడు స్పెషలిస్ట్ వైద్యుల్ని గడప వద్దకు చేర్చేలా జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ కార్యక్రమం అప్రతిహతంగా సాగుతుందని తెలిపారు. ఇంటింటికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం తొలి దశ విజయవంతమై, ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని వివరించారు. పేదలంతా ఆరోగ్యంగా ఉండేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 104 వాహనాల ద్వారా 14 రకాల పరీక్షలు, 108 ద్వారా ప్రమాద బాధితులు, గర్భిణులు, బాలింతలకు సేవలందించడతో పాటు హైరిస్క్ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా రోగుల్ని గుర్తించి ఖరీదైన వైద్యం అందిస్తున్నారని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చి, వైద్యాన్ని ప్రతి ఇంటి గడపకే చేర్చుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి, డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ ఆసియ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందుల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ డెప్యూటీ హెల్త్ సెక్రటరీ మంజుల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.రవి, డెప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బి.చంద్రశేఖర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఒకటో వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, నాయకులు మాదిగొండ నారాయణ, కాటుమాల డేవిడ్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'బంగారు' వెలుగులు

- మహిళా వివక్ష నిర్మూలన కోసమే 'బంగారు తల్లి' అమలు
- స్థానిక ఏరియా వైద్యశాలలో పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే
- పలువురు ఆడపిల్లలను కన్న బాలింతలకు సత్కారం
- రాష్ట్రంలో ఒక్క పల్నాడు జిల్లాలోనే బంగారుతల్లి పథకం అమలు



ఆడపిల్లలు పుట్టిన తల్లులకు ఫొటో బహూకరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: జిల్లాలో మహిళా వివక్ష నిర్మూలనకే బంగారు తల్లి పథకం ప్రవేశపెట్టామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణ ఏరియా ఆసుపత్రిలో బంగారు తల్లి 2.0 కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలసి బుధవారం కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వాసుపత్రిలో అప్పుడే పుట్టిన ఆడపిల్లకు జన్మనిచ్చిన బాలింతలతో కేకును కట్ చేసి గుర్తింపు కార్డును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బంగారు తల్లి పథకం పేరుతో పుట్టిన ఆడపిల్లకు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పుట్టిన రోజు వేడుకలు జరుపుకునేలా వారి ఫోటో తీసి డాక్టర్లు, సిబ్బంది మొత్తం ఓ పండగ రోజు నిర్వహించుకునేలా రూపొందించామని చెప్పారు. అప్పుడే పుట్టిన ఆడపిల్లల తల్లిదండ్రులు సంతోషంగా ఉండేలా వేడుకల్ని నేటి నుంచి జిల్లాలో అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం, బుధవారం, పట్టణ ప్రాంతాల్లో గురువారం, శుక్రవారం ప్రత్యేకంగా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది చేపడతారని వెల్లడించారు. ఆసుపత్రి నుంచి ఆ బిడ్డను తల్లిదండ్రులు తీసుకువెళ్లిన తర్వాత ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ స్కూల్లో ఏర్పాట్లు చేస్తారని వివరించారు. డిగ్రీ చదివే వరకు ప్రభుత్వం అన్ని వసతులు, వనరులు కల్పిస్తుందని ప్రకటించారు. ఆడపిల్లలు సంరక్షణ బాధ్యతలను తల్లిదండ్రులతో పాటు ప్రభుత్వాధికారులు, వైద్య సిబ్బంది మొదలుకొని అంగన్ వాడీ సెంటరు వరకు స్వీకరిస్తారని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ బంగారు తల్లి కార్యక్రమం రాష్ట్రంలో ఒక్క పల్నాడు జిల్లాలోనే అమలవుతోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో ఏ ఒక్క ఆడపిల్ల పుట్టినా నిరాదరణకు నోచుకోకుండా బంగారు తల్లి కొనసాగించేలా కలెక్టర్ కార్యక్రమాన్ని రూపొందించినందుకు అభినందించారు. ఇటువంటి పథకాన్ని జిల్లాలో అమలు చేయడం అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల పర్యవేక్షణాధికారి డాక్టర్ బి.వి.రంగారావు, వైద్యశాల సూపరింటెంట్ డాక్టర్ మంత్రూనాయక్, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషా బేగం ఖాజావలి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, ఆర్‌ఎంవో డాక్టర్ దయానిధి, వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

- రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధీమా
- పనిచేయని చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు
- ఇక్కుర్రులో గోదాము, సహకార భవన్ ప్రారంభం
- పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



గోదామును ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: చంద్రబాబు ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు తెరలేపినా వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని ఇక్కుర్రులో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్, సహకార భవనాన్ని మంత్రితో పాటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల హామీలతో మరోసారి ప్రజల్ని మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఓట్ల రాజకీయం తప్పా ప్రజల సంక్షేమం ఆయనకు పట్టదని విమర్శించారు. ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా కొనసాగిన చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పానికి ఇప్పటి వరకు ఎందుకు విమానాశ్రమం ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. కూరగాయల ఎగుమతి కోసం ఇప్పుడు కొత్తగా విమానాశ్రమం ఏర్పాటు చేస్తానని ఆయన చెప్పడం రైతుల్ని మోసం చేయడమే తెలిపారు. చంద్రబాబు పుట్టిపెరిగిన నారావారిపల్లెలో పాఠశాలను కూడా సీఎం జగన్ అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. రైతుల పక్షపాత ప్రభుత్వంగా అన్ని విధాలుగా వారికి అండగా నిలుస్తుందని తెలిపారు. రైతుల గుర్తించి ఆలోచించే ఎంపీ, ఎమ్మెల్యేలు ఉండటం నియోజకవర్గ అదృష్టమని కొనియాడారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ గోదామును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రూ.91లక్షలతో సహకార భవన్, గోదాములను నిర్మించినట్లు చెప్పారు. కల్యాణమండపం నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. రైతులకు మేలు చేసే రాష్ట్ర ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, వైస్ ఎంపీపీ యాంపాటి వెంకటప్పారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కన్నెబోయిన శ్రీనివాసరావు, కంటు అంజయ్య, సర్పంచ్ యంపరాల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పేరుబోయిన రామయ్య పాల్గొన్నారు.

ఏసీబీ అధికారులకు చిక్కిన విద్యుత్ ఏఈ

- రైతు నుంచి లంచం తీసుకుంటూ దొరికిపోయిన రాజుపాలెం ఏఈ
- వ్యవసాయానికి ట్రాన్స్‌ఫారం బిగించేందుకు రూ. లక్ష లంచం డిమాండ్



లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ విద్యుత్ ఏఈ, ప్రైవేటు ఎలక్ట్రీషియన్

రాజుపాలెం: లంచం తీసుకుంటూ ఓ విద్యుత్ ఏఈ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. రైతు నుంచి రాజుపాలెం ఏఈ లంచం తీసుకుంటుండగా గుంటూరు ఏసీబీ అధికారులు కాపు కాసి బుధవారం పట్టుకున్నారు. మండలంలోని ఉప్పలపాడుకు చెందిన రైతు సరికొండ వెంకటేశ్వరరాజు, బంధువులతో కలసి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు డిసెంబర్ డిసెంబర్ 12న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడు. దీనికి గాను ఏఈ వి.వి జ్ఞానప్రసాద్‌ను వెంకటేశ్వరరాజు సంప్రదించగా, లక్ష రూపాయలు డిమాండ్ చేశాడు. దీనికి గాను మొదటి విడతగా రూ. 45వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. మిగతా పైకం ట్రాన్స్‌ఫారాన్ని బిగించిన తరువాత ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టపడని రైతు వెంకటేశ్వరరాజు గుంటూరు ఏసీబీ అధికారుల్ని సంప్రదించాడు. బుధవారం గుంటూరు నుంచి సుమారు 50 మంది ఏసీబీ అధికారులు రాజుపాలెం విద్యుత్ కార్యాలయం వద్ద, రెడ్డిగూడెం బస్టాండ్ సెంటర్‌లోను, గణపవరం సరిహద్దులలోను, ఉప్పలపాడులో గుర్తుపట్టని విధంగా మకాం వేశారు. అదే సమయంలో విద్యుత్ ఏఈకి ఫోన్ చేయగా' నేను వస్తున్నాను.. నువ్వు రెడ్డిగూడెంలో ఉండ'ని రైతుకు చెప్పాడు. ఏఈతో పాటు ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఎస్‌కె. ఆదాంషఫీ రెడ్డిగూడెం వచ్చి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న రేకుల షెడ్‌లో వెంకటేశ్వరరాజు నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఒక్కసారిగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం రాజుపాలెం విద్యుత్ కార్యాలయానికి వచ్చి రికార్డులు తనిఖీ చేశారు. దాడుల్లో అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తె, డీఎస్పీలు సత్యానందం, టి.వి.వి ప్రతాప కుమార్, ఆరుగురు సీఐలు, ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాపట్ల జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా వై.రామకృష్ణ

బాపట్ల: జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా వై.రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయనతో పాటు డీఆర్‌డీఏ పీడీగా చొప్పర కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇరువురు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. బాపట్ల జిల్లా అభివృద్ధికి కృషి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఇరువురికి సూచించారు.

చెక్‌పోస్టుల ఏర్పాటుతో గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట

జిల్లా మైన్స్ ఏడీ రాజేష్‌కుమార్

బల్లికురవ: ప్రభుత్వం గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రధాన కూడళ్లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసిందని జిల్లా మైన్స్ ఏడీ ఆర్ రాజేష్‌కుమార్ వెల్లడించారు. బుధవారం బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ శ్రీనివాస, సత్యకృష్ణ ఇంపీరియల్ గ్రానైట్ క్వారీలను ఆయన పరిశీలించారు. పర్మిట్ లేకుండా, సీనరేజ్ చెల్లించకుండా, అక్రమంగా గ్రానైట్ రాళ్లు తరలించకుండా ఉండేందుకు గానూ ఎగుమతికి సిద్ధంగా ఉన్న బ్లాకులకు నంబర్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజ్‌కు చెల్లిస్తున్న పర్మిట్‌తోనే గ్రానైట్ రాళ్లు ఎగుమతులు చేపట్టాలన్నారు. అక్రమంగా తరలిస్తే లారీలకు పెనాల్టీ విధించటంతో పాటు సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయటంతో అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, దళారీ వ్యవస్థకు కొంతమేర చెక్ పడిందని ఏడీ అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

సావిత్రిబాయి జీవితం ఆదర్శనీయం

కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జీవితాన్ని విద్యార్థినులు ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. రైల్వేస్టేషన్ సమీపంలోని గిరిజన బాలికల పాఠశాలలో బుధవారం సావిత్రిబాయి 193వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ శివశంకర్ పాఠశాల ఆవరణలోని సరస్వతి విగ్రహానికి, సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ, నిర్బంధాలను దాటుకుంటూ సావిత్రిబాయి ఆదర్శంగా నిలిచారని వివరించారు. బాలికలు రక్తహీనత సమస్యను అధిగమించాలని సూచించారు. ఈసందర్భంగా వివిధ రంగాలలో గుర్తింపు పొందిన మహిళలను సత్కరించారు. అలాగే పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందచేశారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారిణి ఎల్.వరలక్ష్మి, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.కుమారి పాల్గొన్నారు.

చెంచుగూడేల్లో మౌలిక వసతులు కల్పించండి..

నరసరావుపేట: జిల్లాలో ప్రతి గిరిజన చెంచుగూడెంలకు పీఎం జన్‌మన్ పథకం కింద మౌలిక సదుపాయాలు, ప్రసార సాధనాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ హార్టీకల్చర్ అధికారి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి, వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో ప్రధానమంత్రి జనజాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన చెంచులకు తాగునీటి కుళాయిలు, ప్రతి ఇంటికి విద్యుత్, అందరికీ ఆరోగ్యం, పౌష్టికాహారం, నాణ్యమైన విద్యతో పాటు జీవనోపాధులు, ప్రసార సాధనాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. మండల పరిషత్ అధికారి ఆధ్వర్యంలో ప్రతి సచివాలయ సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు చెంచుగూడెం గ్రామాలను సందర్శించి ఈ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన వారిని గుర్తించి నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో పాటు ఆధార్, జాబ్‌కార్డులేని వారిని గుర్తించి, వాటిని అందజేయాలని కోరారు. డీఎఫ్‌ఓ రామచంద్రరావు, డీడీఓ మహాలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, డీఈఓ శామ్యూల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ శివశంకర్

మహిళా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే కృషి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల: ఎంతోమంది నిరుపేద మహిళలకు విద్యా దానం చేసి వారి జీవితాలలో వెలుగులు నింపిన విద్యావేత్త సావిత్రిబాయి పూలే అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని తన కార్యాలయంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా సావిత్రిబాయి పూలే, జ్యోతిరావుపూలే చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ భారత దేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు, స్త్రీలకు విద్యను నేర్పించి వారి హక్కుల కోసం పోరాడిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అన్నారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఉపాధ్యాయినులకు, మహిళా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కట్టా వెంకటేశ్వరరెడ్డి, మద్దాలి సుబ్బయ్య, కొక్కెర కొండలు, పల్నాడు బలహీన వర్గాల ఐక్యవేదిక కార్యదర్శి షేక్ షరీఫ్, నాయకులు, కార్యకర్తలు, బీసీ నాయకులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

సాయినగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

- పరిశీలించిన రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి మంజుల
- 221మందికి వైద్యపరీక్షలు, మందులు అందజేత

నరసరావుపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం బుధవారం ఒకటో వార్డులోని సాయినగర్ సచివాలయ ప్రాంగణంలో నిర్వహించారు. డీఎండీహెచ్‌ఓ డాక్టర్ రవి పర్యవేక్షణలో బరంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి మంజుల పరిశీలించారు. శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, వైద్యసిబ్బందితో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. రక్తపరీక్షలు తదితర వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో గైనకాలజిస్టు డాక్టర్ సౌజన్య, కీళ్ల, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ ధర్మానాయక్ వైద్యసేవలు అందజేశారు. కళ్ల పరీక్షలను స్థానిక రామలింగారెడ్డి వైద్యశాలకు చెందిన సిబ్బంది పరీక్ష చేశారు. మొత్తం 221 మంది ఓపీ నమోదుచేయగా అందులో పురుషులు 82మంది, స్త్రీలు 139మంది ఉన్నారు. శిబిరాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, డాక్టర్ కె.హనుమకుమార్ పరిశీలించగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గాయత్రి వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి మంజుల, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి

హత్య కేసులో వ్యక్తికి జీవితఖైదు

నగరంపాలెం: హత్య కేసులో ముందాయికి జీవిత ఖైదు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ బాపట్ల జిల్లా 4వ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించారు. గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ బుధవారం అందించిన వివరాలు.. పొన్నూరు మండలం కసుక్రరులో 2016లో కుటుంబ నేపథ్యంలో అంబటి వెంకటశివశ్రీనివాసరావు తన బావమరిది ఆళ్ల రఘునాథ్‌బాబును దారుణంగా హత్య చేశాడు. ఈ మేరకు పొన్నూరు రూరల్ పీఎస్‌లో కేసు నమోదు చేయగా, అప్పటి సీఐలు బాలసుబ్రహ్మణ్యం, చంద్రమౌళి దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాది, బాధితులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, భౌతిక సాక్ష్యాధారాలను సేకరించారు. నిందితుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. నేరం రుజువు కావడంతో అంబటి వెంకట శివశ్రీనివాసరావుకు శిక్షను ఖరారు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి సీఐ బాలసుబ్రహ్మణ్యం ప్రస్తుతం డీసీఆర్‌బీ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో దర్యాప్తు అధికారి, పొన్నూరు రూరల్ పీఎస్ సిబ్బంది ని జిల్లా ఎస్పీ అభినందించారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్‌లో రైలు ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లు కేటాయించినట్లు గుంటూరు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబర్ 07089 సికింద్రబాద్- బరంపూర్ వయా గుంటూరు డివిజన్ మీదుగా ఈనెల 7, 14 తేదీలలో ప్రత్యేక రైలు ప్రయాణిస్తుందని చెప్పారు. ఈ రైలు సికింద్రబాద్ నుంచి సాయంత్రం 7.45 గంటలకు బయలుదేరి బరంపుర్ స్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. 07090 బరంపూర్- వికారాబాద్ రైలు ఈనెల 8,15 తేదీలలో బరంపూర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు వికారాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 07091 వికారాబాద్- బరంపూర్ రైలు ఈనెల 9, 16 తేదీలలో వికారాబాద్ స్టేషన్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు బరంపూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని చెప్పారు. 07092 బరంపూర్- సికింద్రబాద్ రైలు ఈనెల 10, 17వ తేదీలలో బరంపూర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరుసటి ఉదయం 6.30 గంటలకు సికింద్రబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. 08548 శ్రీకాకుళం- వికారాబాద్ రైలు ఈనెల12, 19, 26 తేదీలలో శ్రీకాకుళం నుంచి సాయంత్రం 5 గంటలకు బయలుదేరి వికారాబాద్ స్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 9 గంటలకు చేరుకుటుందని చెప్పారు. 08548 వికారాబాద్- శ్రీకాకుళం రైలు ఈనెల 13, 20, 27 తేదీలలో వికారాబాద్ స్టేషన్ నుంచి రాత్రి 8.25 గంటలకు బయలుదేరి శ్రీకాకాళం స్టేషన్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. 07272 కాకినాడ టౌన్- సికింద్రబాద్ రైలు ఈనెల 13వ తేదీన కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. 07093 సికింద్రబాద్ -బరంపూర్ రైలు ఈనెల 8,15 తేదీలలో సికింద్రబాద్ స్టేషన్ నుంచి రాత్రి 7.45 గంటలకు బయలు దేరి బరంపూర్ స్టేషన్‌కు మరుసటి రోజు 11.15 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. 07094 బరంపూర్-సికింద్రబాద్ రైలు ఈనెల 9,16 తేదీలలో బరంపూర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు సికింద్రబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. 07251 నరసాపూర్- సికింద్రబాద్ రైలు ఈనెల 10వ తేదీ నరసాపూర్ స్టేషన్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు జామున 4.50 గంటలకు సికింద్రబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 07252 రైలు సికింద్రబాద్- నరసాపూర్ రైలు ఈనెల 11వ తేదీన సికింద్రబాద్ స్టేషన్ నుంచి ఉదయం 8.35 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.30 గంటలకు నరసాపూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు గమనించి ప్రత్యేక రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పందెం కోడిపుంజు వేలం



తెనాలిరూరల్: కోడి పందేల శిబిరంపై దాడి చేసిన పోలీసులకు పందెం రాయుళ్లతో పాటు పందెం కోడి చిక్కింది. అయితే పోలీసులు ఆ కోడిని వేలం వేస్తే రికార్డు ధర పలికింది. ఇటీవల తెనాలి మండలం తేలప్రోలు, సోమసుందరపాలెం గ్రామాల మధ్య కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించారు. పందేలు వేస్తున్న 15 మందిని అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ.16,080, ఏడు బైక్‌లు, సెల్‌ఫోన్‌లు, ఒక పందెం కోడిపుంజు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు. పోలీసులకు చిక్కిన కోడిని మంగళవారం వేలం వేయగా రూ.22,800 కు కఠెవరానికి చెందిన గోపి దక్కించుకున్నాడు. వేలంలో వచ్చిన నగదును ప్రభుత్వ ఖానాకు జమ చేయనున్నట్లు ఎస్‌ఐ బుధవారం తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణలో ల్యాబ్ టెక్నీషియన్‌ల పాత్ర కీలకం



బాపట్ల అర్బన్: వైద్య, ఆరోగ్య రంగంలో ల్యాబ్ టెక్నీషియన్‌ల పాత్ర ఎంతో కీలకమైందని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌ల నెలవారీ సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ పాల్గొన్నారు. జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి డాక్టర్ విజమ్మను ఘనంగా సన్మానించారు. ల్యాబ్ టెక్నీషియన్ల జిల్లా అధ్యక్షుడు భయ్యా శంకర్ మాట్లాడుతూ పీహెచ్‌సీల్లోని ల్యాబ్‌లలో వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం 64 రకాల పరీక్షలను చేయాలని ఆదేశించిందని, దానికి అనుగుణంగా ప్రతి ల్యాబ్‌లో వసతులు కల్పించాలని కోరుతూ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ దృష్టికి తీసుకువచ్చారు. డాక్టర్ విజయమ్మ స్పందిస్తూ వసతుల కల్పన విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఏసీఏ ఆంధ్ర, సెంట్రల్ జోన్ అండర్-14 మ్యాచ్‌లు ప్రారంభం

తొలి మ్యాచ్‌లో ప్రకాశం జట్టుపై కృష్ణా విజయం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో ఆంధ్ర సెంట్రల్ జోన్ అండర్-14 అంతర జిల్లాల వన్‌డే క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లో కృష్ణా, ప్రకాశం జిల్లాల జట్లు తలపడగా, కృష్ణా జట్టు 4 వికెట్ల తేడాతో ప్రకాశం జిల్లా జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న ప్రకాశం జట్టు 43.4 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని సుమిత్ 39 పరుగులు చేయగా, కృష్ణా జట్టు బౌలర్లు సంజయ్ 4వికెట్లు, రణధీర్ 2వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 34.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసి విజయం సాధించింది. కృష్ణాజట్టు బ్యాట్స్‌మెన్ ఆకర్ష్ అజేయంగా 65 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ప్రకాశం బౌలర్లు గణేష్, రామ్ 2 వికెట్లు చొప్పున సాధించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, రాష్ట్ర జూనియర్ జట్టు సెలెక్షన్ కమిటీ చైర్మన్ సురేష్, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు. కాగా, గురువారం గుంటూరు, ప్రకాశం జిల్లా జట్ల మధ్య రెండవ మ్యాచ్ జరగనుంది.

నాబార్డు సహకారంతో సొసైటీల అభివృద్ధి

ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి

శావల్యాపురం: నాబార్డు సహకారంతో సొసైటీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరులో బుధవారం జరిగిన శీతల గిడ్డంగి కేంద్రం ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో నాబార్డు ద్వారా ఆప్కాబ్ వ్యవసాయ సహకార పరపతి సంఘాల బలోపేతానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సొసైటీలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని తెలిపారు. ఆప్కాబ్ ఇప్పటి వరకు రూ. 37 వేల కోట్లను నాబార్డు సహకారంతో సొసైటీల అభ్యున్నతికి వెచ్చించినట్లు వెల్లడించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు రూ. 8వేల కోట్లు మంజూరు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. రైతుల పండించిన పంటలు నిల్వ ఉంచటానికి గోదాం నిర్మాణ పనులకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా గోదాం నిర్మాణ పనులకు ఇప్పటి వరకు రూ. 800 కోట్లు కేటాయించామని తెలియజేశారు. సొసైటీ ఆధ్వర్యంలో తీసుకున్న రుణాల్ని రైతులు సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వ పరంగా వడ్డీ రాయితీ వర్తింస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గం పూర్తి స్థాయిలో వెనకబడి ఉందని, రైతుల అభ్యున్నతి కోసం నాబార్డు, ఆప్కాబ్ ఆర్థిక చేయూత అందించాలని కోరారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షపు నీరు నిల్వ ఉంచుకోవటానికి వీలైనంత వరకు కుంటలు, చెక్‌డ్యామ్‌ల ఏర్పాటుకు రైతులకు రాయితీపై రుణాల్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సొసైటీ పరిధిలో ఉన్న వినుకొండ రూరల్ నడిగడ్డ చెరువుకు రూ. 50 లక్షలు మంజూరయ్యాయని, అవి సత్వరమే వచ్చేలా సహకారం అందించాలని కోరారు. ఆయనతో పాటు నాబార్డు సీజీఎం ఎం.ఆర్. గోపాల్, సొసైటీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు ఉన్నారు.



ఆప్కాబ్ చైర్మన్ ఝాన్సీరాణి, సీజీఎం గోపాల్‌తో సమావేశమైన ఎమ్మెల్యే బొల్లా

రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు చరిత్రాత్మకం

- అద్దంకి అభివృద్ధికి రాజీలేని కృషి
- నియోజకవర్గ సమన్వయకర్త హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: మాటతప్పని మడమ తిప్పని నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి వైస్ చైర్మన్ పద్మేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హనిమిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అవ్వాతాతలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచి అందజేస్తున్నారన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రతి నెల 1వ తేదీ ఉదయాన్నే వలంటీర్లు వచ్చి తలుపుతట్టి పింఛన్ అందజేస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అద్దంకి ప్రజల అండదండలు ఉంటే కొండలనే కాదు అనకొండలైనా ఎదుర్కొంటానన్నారు. తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అద్దంకి ప్రజలు విశేషమైన ఆదరాభిమానాలు చూపిస్తున్నారన్నారు. పట్టణంలో పాత, కొత్త పింఛన్ లబ్ధిదారులు 4006 మందికి గానూ రూ.1.20 కోట్ల చెక్కును పురపాలక సంఘ చైర్మన్ ఎస్తేరమ్మకు అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు పెంచిన పింఛన్ సొమ్మును అందజేశారు. అంతకుముందు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అనంత లక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, వార్డు కౌన్సిలర్‌లు, వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న హనిమి రెడ్డి



పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న హనిమి రెడ్డి